# ముక్కల శాపం!

-ఉపద్రష్ట కృష్ణప్రియ

గాలిబావ రయ్యిన పరిగెడుతూ ఈలవేసేడు. ఒళ్లంతా పులకరించినట్లైంది మామిడికీ, వేపకీ.

"గాలిబావ అప్పుడప్పుడు ఇలా హడావుడి చేస్తుంటే భలేగా వుంటుంది. కదక్కా" అంది వేప.

"ఆ. బాగానే వుంటుందిగానీ, ఆ తుఫానులో, గండాలో..."

"గండం కాదక్కా. గుండాలు. వాయుగుండాలు..."

"అదేలే. అవొస్తేనే నిలబడడానికి కూడా కష్టంగా వుంటుంది. దానికి తోడు వానమావ తోడైతే, కాళ్ల దగ్గర ఎప్పుడూ గుక్కెడు నీళ్ళుండవుగానీ, ఇంటినిండా నీళ్ళుచేరి కాళ్ళుతేలిపోయి పడిపోతానేమోనని హడలి చస్తున్నానుకో.." కిలకిలా నవ్వింది మందారం.

"పూవింటివారు మరీ బడాయి పోతున్నారు" రుసరుసగా అంది మామిడి.

"అది కాదక్కా. ఓసారి నీ నడుంమీద పడుకున్న మనింటాయన 'ఆహా ఏం గాలి.. ఎంత చెట్టుకి అంతగాలి' అన్నాడు. అది గుర్తుకొచ్చింది. నీవేమో ఇంత ఒడ్డూ, అంత పొడుగూనాయె. మేమా ఓ మాదిరివాళ్లం. కాస్త ఎదిగామా, ఈ మనుషులు పరమదుర్మార్గులు. పూలు కోసుకుందుకి అందకుండా పోతామని మా రెక్కలూ, శీర్షాలూ చెక్కి పారేస్తారు. ఏదో మళ్లీ పక్కనుంచి, పెరగగల సత్తావుంది గాబట్టి ధైర్యం తెచ్చుకుని పెరుగుతున్నాము. కదక్కా?"

"ఈ మనుషులకి అన్ని రుచికరమైన పళ్లనిస్తానా, కృతజ్ఞతలేనివారు. రాళ్ళెట్టి కొట్టే రాలుగాయిలు కొందరైతే, కర్రకి కత్తికట్టి పరపరా కోసేవాళ్లు కొందురు. కరువుకొట్లులాగా పుటుక్కున తెంపేవాళ్ళు ఇంకొందరు. ఈ ఇంటావిడైతే 'నా బంగారు తల్లివే ఎన్ని తియ్యని పళ్లనిస్తున్నావే' అని నన్ను ఆప్యాయంగా పట్టుకుని, నేనిచ్చే పళ్లని కళ్లు తృప్తితో నిండిపోతుండగా మెల్లిగా తెంపుతుంది. ఆవిడ తెంపుతున్నా, ఏమిటో అంతగా బాధేయదు" అంది మామిడి.

"నిజమేనక్కా ఈ ఇంటాయనైతే ఎప్పుడూ ఏదో 'తదరినాం' అని పాడుకుంటూనే ఉంటాడు కదా. నీళ్లుపోసేటప్పుడు ఆయన పాడే పాటలు నన్ను పరవశింపచేస్తాయనుకో" అంది మందారం.

"మరే..మరే" అంది మామిడి తృప్తిగా.

"మీకేమమ్మా. మీ అందరి పనీ హాయి. పూలూ, కాయలే కదా. తెంపితే ఏదో ఇలా గిల్లినట్లే ఉంటుంది. ఉగాది వస్తేనే చచ్చే చావొస్తోంది. పువ్వు పుట్టనియ్యరు. అమ్ముకునే వాళ్లైతే మరీనూ. నెత్తికెక్కి ఎడాపెడా రెక్కలు విరిచేస్తారు. పిల్లలకి ఒంట్లో బాగుండకపోతే నా చేతులు నరికి నీళ్లల్లో వేసుకుంటారు. ఒంటిమీద పెట్టుకుంటారు. మనకి వాళ్లలాగ రెండు చేతులు కాదుగదా సహస్ర బాహువులూ, శీర్షాలూ ఉంటాయి కదా. ఇలా వాళ్లకి ఉపకరిస్తున్నందుకు ఎంతో ఆనందంగానే ఉంటుంది. భక్తిగా పూజలు కూడా చేస్తారనుకో. గాలిబావ కితకితలు పెడుతూంటే ఇలా ఇలా కదలిపోతానా. ఏం గాలి...ఎంత ఆరోగ్యం అనుకుంటారు ఈ ఇంట్లో వాళ్లు. నాకెంతో తృప్తిగా వుంటుంది. అంతా బాగానే ఉందిగానీ తెల్లారి లేచినదగ్గర్నుంచీ పాచి ముఖాలతో నా తలమీదకెక్కి, నా రెక్కలు విరిచి, కణుపుల దగ్గర ముక్కలు చేసుకుని, నమిలి నమిలి, నా నరాలన్నీ చితక్కొట్టి బ్రష్షులాగా వాడుకుంటున్నారు. నా రక్తం వాళ్ల పళ్లకీ, నోటికీ ఎంతో మంచిదట. నా చిగుళ్ళు తింటే కడుపులో నులిపురుగులు లేకుండా పోతాయట" అంది వేప.

"సరేలే! అలాంటి సంబరాలు నాకూ ఉన్నాయి. పండగొస్తోందంటే హడిలి ఛస్తున్నాననుకో. అన్ని శుభాలకీ నా రెక్కలేగా. ఏదో వీళ్లైతే సద్దుకుందునుగానీ, వీళ్ళ చుట్టాలు కూడా గొప్ప పిసినారు వెధవలు. ఓ రూపాయి పారేస్తే బజార్లో దొరుకుతాయిగా... ముందుగా మా అక్కాచెల్లెల్లవి, విరక్కొట్టుకెళ్ళినవి. ఫ్రీగా వచ్చిందంటే మరింత రెచ్చిపోయి ఎడాపెడా విరిచేస్తారు. బండమనుషులు. కొందరైతే కణుపులదగ్గర కాకుండా మధ్యలో చీరుతారూ, ఆపై చర్మం సగం తొక్క ఊడిపోయి, ఆ ముక్క తెగక, వాళ్లు తిప్పి తిప్పి తెంపుతుంటే నరకం చూస్తున్నాననుకో. నడుం ఒంగిపోయిందికదా అక్కడ అట్లతద్దిరోజుని ఉయ్యాలలేసి ఊగుతారు. పెద్దాళ్ళు కూడా ఊగుతుంటే బరువుకి తాడు నన్ను రాసుకుని, రాసుకుని చర్మంలోకి దిగబడిపోతోంది. ఏమిటో ఈ జన్మ ఒక్కోసారి ఎక్కడికైనా పారిపోదామనిపిస్తుందిగానీ, ఎక్కడికీ కదలలేము కదా. ఆ భగవంతుడు బతుకున్నాళ్ళూ నిలబడే బతకమని శాసించేడాయె" అంది మామిడి.

"అక్కా నీకైతే అలాగ, నా లేలేత చిగుళ్లని పిసికి తలకి పెట్టుకుంటే ఎంతో మంచిదట. వారం వారం ఏ వేపుకి గాలేస్తుందోనని భయమేస్తోంది. నేను గానీ అందలేదనుకో పూవుకోయాలన్నా, ఆకు కోయాలన్నా నా శిరస్సుని పాదాల దాకా వంచేస్తుంది. నేనుగానీ అందలేదనుకో పూవు కోయాలన్నా, ఆకు కోయాలన్నా నా శిరస్సుని పాదాలదాకా వంచేస్తుంది వీళ్ల పెద్దమ్మాయి. ఇంతేగాకుండా తెల్లారి ఓ ముసలాడు పాలిథిన్ సంచీ పట్టుకుని, కొక్కెం ఉన్న ఓ ఇనుప ఊచని తెచ్చుకుంటాడు. గోడ అవతల నించి ఆ ఊచతో గట్టిగా లాగి పట్టుకుని పూలు లాగుతాడు ఎక్కడ నడుం విరుగుతుందోనని హడలి ఛస్తున్నాను" అంది మందారం ఆవేదనగా.

"అమ్మో...అమ్మో..వాడొచ్చేస్తున్నాడు..." గాభరాగా అంది వేప.

"ఎవరూ?" అన్నారు మామిడీ, మందారం.

"ఇస్త్రీవాడు సరిగ్గా నాకిందే పెడతాడు బిఛాణా. ఆ మధ్య కరెంటు వాడు, వాళ్ల తీగలకి అడ్డంవచ్చాననంటూ కొండ మంగలాడు డెక్కినట్లు గుండు గీకేసి వెళ్ళేక చాలా రోజులు అతను రాలేదు. ఇదిగో మళ్లీ పుంజుకున్నానుగా మళ్ళీ తయారు. పోనీ ఏదోలే అని సర్దుకుందామంటే, నాకాళ్లమీద చక్కగా సద్దుకు కూర్చుని భోంచేస్తాడు. అది పెద్ద బాధెయ్యదుగానీ, బొగ్గులు

నుసి దులిపేప్పుడు నా మీద రవ్వలు పడేట్లు దులుపుతాడు. మొన్న కాలివేళ్ళమీద రెండు రగులుతున్న బొగ్గులు పడ్డాయి. చురుకుమని ప్రాణం జిల్లార్చుకుపోయిందనుకో, అప్పడే చెయ్యికడుక్కున్నాడు గాబట్టి సరిపోయింది. ఏమిటో ఖర్మ'' అంది వేప.

"మరే. ఆ మధ్య నాదగ్గరుకూడా పెట్టేవాడు గానీ, ఓ రోజు మన నేస్తాలు కాకులూ, పిచ్చుకలూ బట్టలన్నీ ఖరాబు చేసేసేయి. అందుకని నీ



దగ్గరు చేరుతున్నాడు...అమ్మో! కారొస్తోంది. ఆ కారాయనకి అంత ఇల్లూ పెద్ద వాకిలీ వుందా. పెద్దగేటు పెట్టుకుని కారు పెట్టేసుకోవచ్చుగా. వట్టి పిసినారు. 'సార్ మీరు చక్కగా గేటుకు రెండువేపులా రెండు చెట్లు నాటేరు. నీడగా వుంది. మీకభ్యంతరం లేకపోతే నా కారు, పగలు ఇక్కడ పెట్టుకోనా?' అన్నప్పుడు 'టాట్' వీల్లేదు అనొచ్చుగా. 'దాందేముంది పెట్టుకోండి' అనేసేరు ఈ దంపతులు. టైర్లు కాళ్లమీద పెట్టి వుంచేస్తున్నాడు. బరువు మోయలేక ఛస్తున్నాను. మొన్న సడన్‌గా డోర్ తీసాడు. పొట్టలోకి కసుక్కున ఓ అంగుళం మేర దిగిపోయింది. దీనికి తోడు రోడ్డు తుడిచిన వాళ్ళు ఆ చెత్తంతా పోగేసి మంట పెడతారు నా నీడలో. రెక్కలు వచ్చివి ఆ సెగలకి తగలబడిపోయి యమలోకం యిక్కడే కనిపిస్తోంది. ఎక్కడికీ కదలలేమని ఆ ముష్యరులకి తెలియదా? ఆపై ఈ జనాలు ఎక్కడ పడితే అక్కడే ఈ పోలిథిన్ సంచులు పడేస్తున్నారు. వీళ్లు నీళ్లుపోసినా మనదాకా ఎక్కడొస్తున్నాయి? ఏనాడో ఏం పాపం చేసామో. పుట్టినప్పుడు ఉయ్యాలతో మొదలై, చివరికి బూడిదయ్యేదాకా మనం లేందే గడవదీ మనుష జాతికి. మనమంటే ప్రేమాలేదు, దయాలేదు. ఒక చెట్టు వేసి పెంచి మన జాతిని పెంచుదామన్న కోరికా లేదు. మన సంతతి నానాటికీ తరిగిపోతోంది. ఇదివరలో వీధికి ఈ వేపు వదీ, ఆ వైపు వదీ చెట్లుండేవిట. చేతులు చేతులు కలుపుకుని సయ్యాటలాడే వాళ్లమని, మొన్న పడిపోయిన అగ్నిపూలచెట్టు అంటూ ఉండేది. ఇప్పుడు గాలిబావ మన చుట్టాలనుంచి కబురువేసుకొస్తే తప్ప మనవాళ్ళెక్కడున్నారో అసలు తెలియడంలేదు'' అంది మామిడి.

"నేను బతికున్నన్నాళ్ళూ నా ఆకులు, పువ్వులు కాయలు, దొప్పలు అన్నీ వాడుకుంటారు. కార్తీకమాసం అంటే హడలి ఛస్తున్నాను. నా దొప్పల్లో దీపాలెడితే స్వర్గానికి సరాసరి వెళ్లిపోతారుట. ఇలా దొలిచి పారేస్తారు. నా నారతో మాలలల్లుకుంటారు, దీపాలెట్టుకుంటారు. ఈ మధ్య నారతో బేగులు కూడా చేసుకుంటున్నారు. అసలే చలా, ఆపై వీళ్లు చేసే గాయాలు. వ్రతమన్నా, అయ్యప్ప పూజలన్నా, పెళ్ళిళ్ళన్నా, మొదలు నరికి ద్వారబంధాలదగ్గర పెట్టి, దణ్ణాలు పెడతారు. బతికున్నన్నాళ్ళిలాగ, ఆపై నా ఫలం అంటే పళ్ళుగానీ, కాయలుగానీ అందగానే నన్ను ముక్కలు ముక్కలు చేసి ప్రతిభాగము వాడుకుంటారు. ఏదో వీళ్ళకిలా ఉపకరిస్తున్నందుకు బాగానే వున్నా బతికున్నన్నాళ్ళూ క్షణం క్షణం, భయం భయం'' అంది అరటి.

"ఈ మధ్య మననుంచి వాహనాలకు ఉపయోగపడే ఇంధనం తయారుచేస్తున్న విషయం చాలా ఊపందుకుంది. మందులకి ఉపయోగపడే మొక్కలైనా, వాణిజ్యపంటలకైనా, తోటల్లో వృక్షాలకైనా మంచి జాగ్రత్తలే తీసుకుంటారు ఈ జనాలు. మనం వీధిలో ఉన్న మొక్కలం కదా? అందుకే నిరాదరణ. ఈ జనారణ్యంలో కాకుండా అడవిలో పుట్టినా బాగుండేదనిపిస్తోంది'' అంది మామిడి బాధగా.

"మనం ప్రతిఫలాపేక్ష ఇంత కూడా లేకుండా వీళ్ళకి ఇంత ఉపయోగపడుతున్నా, ఖర్మం చాలక పడిపోతే లేవనెత్తరు సరికదా, ఇదే బాగుందని పరా పరా కోయించేసి కుర్చీలూ, మంచాలూ చేయించుకుంటారు. వీళ్ళు వదిలే కార్బన్ డయాక్సైడ్ పీల్చుకుని వీళ్లకి ప్రాణవాయువునిస్తున్నామన్న కృతజ్ఞత కూడా లేని తుచ్ఛులు. అశ్రద్ధచేస్తే అనుభవిస్తారు'' అంది వేప.

"నిజమే. ఇప్పటికైనా ప్రతి ఒక్కడూ ఒక చెట్టు నాటి మన సంతతిని చక్కగా పెంచి, వృద్ధి చేసి ఆదరంగా చూసుకోకపోతే ఇదే నా శాపం. వచ్చే జన్మలో ఈ జనారణ్యంలో మొక్కలై పుట్టి ఈ కాలుష్యాన్నీ, యాతననూ తామూ అనుభవిస్తారు'' అంది వేప.

"అంతే...అంతే..'' అంటూ వంతపలికాయి అన్నీ.

☆